
# ఇలాంటి పున్నారావులతో పారాహుషార్




ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఇప్పుడు నేను మీకు పున్నారావుని పరిచయం చేయబోతున్నాను.

'ఎవరా పున్నారావు? ఏమా కథ?' అనుకుంటున్నారా? కాస్త ఓపిక పట్టండి మరి.

నిజానికి పున్నారావుని పరిచయం చేయనక్కర్లేదు. ఎందుకంటే అతను మన దగ్గర్లోనే వుంటాడు. మనమీద అతని ప్రభావమూ వుంటుంది. తమకు తోచింది చేస్తూ అందరిమీదా రుద్దడమే వీళ్ళ పని. లోకోపకారం చేస్తున్నామనుకుంటారు కాని వీళ్ళ వళ్ళ ఉపయోగంకన్నా అపకారమే ఎక్కువుంటుంది. చిత్తగించండి. మరి..రెడీయా!

○○○

నోటితో పుక్కిలిస్తూ కాలనీలో అటూ ఇటూ తిరుగుతున్న పున్నారావుతో, రంగారావు-

"ఏమిటండీ పున్నారావుగారూ.. నోటితో అదేపనిగా అలా పుక్కిలించేస్తున్నారు?"

చెబుతా అన్నట్టుగా సంజ్ఞ చేసి ఓ పదినిముషాలయిన తర్వాత నోట్లో ఉన్నది ఉమ్మేసి నోరుకడుక్కుని "ఆ..ఏమిటంటారు. ఇది పుక్కిలించడం కాదండి. ఆయిల్ పుల్లింగ్. దీనితో అనేక ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా రోగాలు ఆమడదూరం పరిగెడతాయి. ఈ ఆయిల్ పుల్లింగ్‌మీద పుస్తకాలు కూడా వెలువడ్డాయి. చదవలేదా? నా దగ్గరవుంది ఇస్తాలే!" అన్నాడు.

"అవునా! ఇదెలా చెయ్యాలి?"

"సింపుల్ కానీ ఉపయోగాలు అనంతం"

ఆ కాలనీ అంతా ఆయిల్ పుల్లింగ్‌మీద పడ్డారని వేరే చెప్పనక్కర్లేదు కదా!

అలా 'తా వలచింది రంభ..తా మునిగింది గంగ' అన్నట్టు తనకేదన్నా తెలిస్తే అది అందరితో పంచుకోవడం, మా చెడ్డఅలవాటు పున్నారావుకి.

ఒకరోజు-

సాయంత్రం ఆఫీసునుండి వస్తూ ఆకలేసి నాలుగు వేడి వేడి మిరపకాయ బజ్జీలు కొనుక్కుని తినేసి యధాలాపంగా కాగితం పడేయబోయి అందులో వున్న మేటర్ చదివాడు. అది ఫెంగ్‌షుయ్‌కి సంబంధించింది. లాంఫిగ్ బుద్ధ, కాయిన్ నోట్లో వున్న టాడ్, కాపర్ కాయిన్స్ కొని ఇంట్లో పెట్టుకుంటే సిరులు ఎలా వెల్లువలా వచ్చి ఇంట్లో పడతాయో వివరించే ఆర్టికల్ అది. ఇహ మన పున్నారావుకి లేచిందే లేడికి పరుగు కదా! 'అదృష్టం తలుపుతట్టింది కాబట్టే ఆ పేపర్ తన కంటపడింది' అనుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేసి రివ్వున మార్కెట్‌వైపు పోనిచ్చాడు.

మార్కెట్లో ఫెంగ్‌షుయ్ వస్తువులు అమ్మేషాపుని వెతికిపట్టుకుని, లోపలికి అడుగుపెట్టి ఒక్కోవస్తువూ ఏ రకమైన రిజల్ట్ ఇస్తుందో తెలుసుకుని ఇహ తనింట్లో అదృష్టదేవత తిష్టవేసుకుని కూర్చుంటుందని భావిస్తూ దాదాపు పదివేల రూపాయలు వదిలించుకుని, వస్తువులన్నీ జాగ్రత్తగా ప్యాక్ చేయించుకుని ఇంటికి వచ్చేసరికి బాగా చీకటయిపోయింది. ఇహ కాలనీ వాళ్ళకి అవి పరిచయంచేయడం కుదరదు కాబట్టి దాన్ని మరుసటిరోజుకి వాయిదా వేశాడు. ఆ రాత్రంతా చక్కగా వస్తువుల్ని సర్ది, తెల్లవారుఝామున మూడింటికి పడుకుని ఆరింటికి ఆదరాబాదరాగా లేచి తలుపుతెరిచాడు. గుమ్మంముందు రెండు పేపర్లు వున్నాయి. ఒకటి తను వేయించుకునేది. మరోటి బోనస్. 'ఓహ్ అద్భుతం! ఇలా ఫెంగ్‌షుయ్ ఆర్టికల్స్ ఇంట్లో పెట్టాడో లేదో అలా అదృష్టం కలిసివస్తోంది' అనుకుని అందర్నీ పిలిచి ఫెంగ్‌షుయ్ గొప్పతనం చెప్పాడు. ఇంకేముంది అందరూ ఆరోజు సాయంత్రం తలోవస్తువూ కొనుక్కున్నారు. కుదరని వాళ్ళు పున్నారావుకి డబ్బులిచ్చి ఆ వస్తువులు తెచ్చిపెట్టమన్నారు. మనవాడు ఆనందంగా వొప్పుకున్నాడు కాని తన రూట్ కాని చోటుకి వెళ్ళి, వస్తువులు కొనడానికి డబ్బులు తక్కువపడితే తన డబ్బులు వేసి మరీ కొని తీసుకొచ్చి ఇచ్చాడు.

అదో తుత్తి అంతే!

ఆ తర్వాత రోజు షడన్‌గా స్కూటర్‌పాడయి నాలుగు వేల రూపాయల చమురు వదిలింది. ఆఫీసులో పనెక్కువయింది. కాలనీలో అందరిదీ అదే పరిస్థితి. కానీ ఒక గొప్ప మంచి జరిగేటప్పుడు పరిస్థితులు అలాగే పరీక్షిస్తాయని తను సమాధానపడి అందర్నీ సమాధానపరిచాడు. ఇవ్విధంబుగా కొంత కాలం గడిచింది.

ఒకరోజు పున్నారావు ఇంటి బయట అరుగు మీద పద్మాసనం వేసుకు కూర్చుని ముక్కుతో బుసలుకొట్టడం కాలని వాళ్ళకి ఆశ్చర్యంగా అనిపించింది. రాజారావు, పున్నారావు కళ్ళు తెరిచి బుసలు తగ్గేవరకు ఓపికపట్టి 'అదేమిట'ని ఆశ్చర్యంగా అడిగాడు.

"అరే! మీరు ఆస్థా ఛానలు చూడట్లేదా, అందులో రాందేవ్‌బాబా ఆసనాలతో ఆరోగ్యంగా ఎలా వుండవచ్చో సులభమైన ఆసనాలు చెబుతారు. పెద్ద ఎక్కువ సమయం కూడా అక్కర్లేదు. ప్రతిరోజూ ఓ ఐదు, పది నిముషాలు అంతే! చక్కటి ఆరోగ్యం మనసొంతం" అని కపాల్ భాతి, అనులోమ్ విలోమ్ మొదలైనవి చేసి చూపించి, "చూశారా! ఎంత సింపులో. ఇప్పుడు జనాన్ని పీడిస్తున్న బిపి, షుగరులను ఆమడదూరంలో వుంచడమేకాదు, డాక్టర్లని, కార్పొరేట్ ఆస్పత్రులని నామరూపాల్లేకుండా చేస్తాయి ఈ ఆసనాలు" అన్నాడు. కొన్నాళ్ళపాటు ఆ హవా కొనసాగింది. తర్వాత అందరిలో బద్ధకమే గెలిచింది. ఆ తర్వాత పున్నారావు ద్వారా మంతెన సత్యనారాయణరాజుగారు పరిచయం కాబడి అందరూ ఆకులు, అలములు తినడం మొదలెట్టారు. అదీ కొంతకాలమే!

ఒకరోజు-

"ఏవండీ మూర్తిగారూ! మీరు మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారా?" అని అడిగాడు పున్నారావు.

"లేదండీ, అసలు ఆ కాన్సెప్టే నాకు తెలియదు"

"అయితే మీరు విని, అందులో ఇన్వెస్ట్ చేయాలి సిందే. ఎందుకంటే మీ పిల్లల చదువుకి, పెళ్ళిళ్ళకి ఇంకా ఇల్లు కట్టుకోవడానికి, కారు కొనుక్కోవడానికి ఒకటనేమిటి అన్నింటికీ ఓన్లీ వన్ సొల్యూషన్. షేర్లలో అయితే లాస్ వస్తే పాతాళంలోకి కూరుకుపోతాం. అందుకే మ్యూచువల్ ఫండులో సిప్ పద్ధతిలో ఇన్వెస్ట్ చేయాలి. అంటే మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావముండదు. పైగా లాంగ్‌రన్‌లో లాభాలే లాభాలు. ఇది ఎలా పనిచేస్తుందంటే" అని కాగితం మీద ఎక్స్‌ప్లెయిన్ చేశాడు. ఇంకేముంది కాగితంలో అందరికీ వైకుంఠం కనిపించింది.

అందరూ సిప్ విధానంలో హాఫ్ నాలెడ్జ్‌తో ఇన్వెస్ట్ చేశారు. మార్కెట్ పెరుగుతున్నప్పుడు అభినందనలు చెప్పుకుని స్వీట్లు పంచుకున్నారు. పడిపోయినప్పుడు గుండె పట్టుకుని గుభేలు మన్నారు. ఆకులు పట్టుకోవడానికి వీళ్ళేకుండా చేతులు కాల్చుకున్నారు. కొన్నాళ్ళపాటూ బుద్ధిగా కాలం వెళ్ళబుచ్చారు.

ఒకరోజు-

"ఏవండీ, షణ్ముగంగారూ! ఒకసారి ఇలారండి" అని షణ్ముగాన్ని పిలిచి "మీకు పెళ్ళి కావలసిన పిల్లలు వున్నారు కదా, వాళ్ళకి పెళ్ళిచేసి ఒక అయ్య చేతిలో పెట్టేటప్పుడు అమ్మాయికి నిలువెత్తు కాకపోయినా వీసమెత్తు బంగారమన్నా పెట్టాలి కదా" అన్నాడు.

"అవునండీ, నాకూ అదే దిగులు. కానీ బంగారం కొనగలమా అసలు"

"లేము. అందుకే శతకోటి దరిద్రాలకి అనంత కోటి ఉపాయాలన్నారు. గోల్డ్ హార్వెస్టింగ్ అని ఇప్పుడు ప్రతి షాపులో స్కీమ్‌లు ఉంటున్నాయి. మనం ప్రతినెలా కొంతడబ్బు కడితే చివర్న వాళ్ళు కొంతకలిపి దానికి సరిపడ మనం కోరుకున్న ఒక నగ తీసుకోవచ్చు. వాయిదాల పద్ధతిలో తీసుకోవడంవల్ల బాధ తెలియదు, పైగా నగలూ అమరుతాయి. ఏమంటారు? అంతేకాదు కొన్ని షాపుల్లో గిఫ్ట్‌లు ఇస్తారు. మరికొన్నిటిలో తరుగుండదు. మేకింగ్ ఛార్జీలో రాయితీ వుంటుంది. నేను ఇదిగో నాలుగు షాపుల్లో నాలుగు కార్డులు తీసుకున్నాను" అన్నాడు. ఆ సలహా నచ్చడంతో అందరూ వాటిపైన పడ్డారు. గోల్డ్ ధర అప్రతిహతంగా పెరగడంతో రెండు సంవత్సరాల తర్వాత వాళ్ళకి ముక్కుపుడకలు, చెవిదిద్దులు వచ్చాయి. "చూశారా..కనీసం అవన్నా అమిరాయి లేకపోతే అసలు కొనగలమా" అంటున్న పున్నారావువంక కొరకొరా చూశారు. ఈ రెండేళ్ళు పొదుపుచేసి, షాపువాళ్ళకి ఉపయోగపడినట్టనిపించింది వాళ్ళకి. బంగారం అవసరం వచ్చినప్పుడు అప్పో సొప్పో చేసి అప్పుడే కొనుంటే, డబ్బు అప్పునిదానంగా తీర్చుకునే వాళ్ళు. ఇప్పుడు బంగారం కొనలేరు, డబ్బూ వెనక్కి రాదు. అదే మండిపోతోంది వాళ్ళకి.

ఒకసారి-

పనిమీద వచ్చిన పాపారావుతో "గతంలో బూమ్ రావడం వల్ల స్థలాల ధరలు ఆకాశాన్నంటాయి. ఇప్పుడిడప్పుడే కాస్త శాంతించాయి. తెలంగాణ



ఇష్యూతో రియల్ ఎస్టేట్ కాస్త మందగించింది. ఇదే రైట్‌టైమ్ స్థలం కొనడానికి. మనం కనక సిటీ అవుట్ స్కర్ట్స్‌లో స్థలం తీసుకుంటే తక్కువ ధరలో వస్తుంది. ముందు ముందు బాగా డెవలప్ అయినప్పుడు అమ్ముకుంటే లాభాలే లాభాలు. వెధవది బ్యాంకులో వేసుకుంటే ఏవొస్తుంది? ఇన్ఫ్లేషన్ ఇంతలా ఇబ్బంది పెడుతుంటే. మంచి ఇన్వెస్ట్‌మెంట్ అంటే ప్లాట్ కొనడమే! నిన్ననే నేను ఒక రియల్ ఎస్టేట్ ఆఫీసుకెళ్ళాను. వాళ్ళూ గ్రూప్‌గా బుక్ చేసుకుంటే తక్కువకి ఇస్తారట. మరి మనందరం ఈ కాలనీలో ఎప్పటినుండో అద్దెకుంటున్నాము. మనందరం కలిసి ఒక దగ్గరే ప్లాట్లు తీసుకుంటే జీవితాంతం ఒకే కుటుంబంలా కలిసిమెలసి వుండొచ్చు ఏమంటారు?" అన్నాడు.

అందరికీ అది సబబుగా తోచింది. పైగా అద్దెఇళ్ళలో, ఓనర్స్‌తో విసిగివేసారి వున్నారాయే! అందరూ ముక్తకంఠంతో "ఊ" అన్నారు.

సన్ డె సైట్ విసిట్‌కి ఏర్పాటుచేశారు ఆ సంస్థ వారు.

సన్‌డె అందర్నీ డిసిఎం వ్యానులో కుక్కి సిటీకి చాలా దూరంగా మరో ఊరికి చాలా దగ్గరగా వున్న సైట్‌కి తీసుకెళ్ళారు. అప్పటికే అందరికీ ఒళ్ళు పులిసిపోయింది. మధ్యాహ్నం భోజనం పెట్టి లే అవుట్ ముందు పెట్టి కూర్చున్నారు సైట్ మేనేజర్లు.

"సిటీకి చాలా దూరంగా వుంది కదండీ" సందేహం వ్యక్తం చేసింది నీరజ.

"కాబట్టే ఇంత చీప్. ఇప్పటిగురించి ఆలోచించవద్దు. ఫ్యూచర్ అంతా గోల్డ్. భవిష్యత్తులో రింగ్ రోడ్లు, ఫ్లయ్ వోవర్లు వస్తే ఊహించుకోండి. రాబోయే రోజుల్లో ట్రాన్‌పోర్టేషన్ అసలు సమస్యే కాదు. ఎమ్ఎమ్‌టిఎస్, మెట్రోరైల్ అబ్బో ఎక్కడికెళ్ళాలన్నా చిటికెలో వెళ్ళిపోమూ! మీ పిల్లలకి అద్భుతమైన అస్సెట్ కానుకగా ఇస్తున్నట్టు. ఇప్పటి మీ కాలనీలన్నీ ఒకప్పటి జంగల్సే కదా!" అన్నాడు.

"అవున్నిజమే! ఫస్ట్ మన కాలనీలో అద్దె తక్కువని నేనే ముందు వచ్చాను. పెళ్ళాం పిల్లల్తో బిక్కు బిక్కుమంటూ కాలం గడిపేవాళ్ళం. ఇప్పుడో! మనందరితో కళ కళ లాడుతోంది. ఇళ్ళు లక్షలు, కోట్ల ఖరీదులో వున్నాయి."

"అందుకే ఇక్కడికి తీసుకొచ్చాను. ఇహనేం ఆలోచించకుండా ప్లాట్లు తీసుకోండి. ఆలస్యమైతే వెంచర్లో చివరి ప్లాట్లు కొనవలసి వస్తుంది" అని అందరిచేతా ప్లాట్లు కొనిపించాడు పున్నారావు.

సంవత్సరం తర్వాత వెళ్ళిచూసి బావురుమన్నారు. పిచ్చిమొక్కలతో కళా విహీనంగా వుంది ఆ ఏరియా! ఎవరిప్లాట్లు ఏదో గుర్తుపట్టలేకపోయారు. అందరూ పున్నారావుమీద తిట్లవర్షం కురిపించారు. అసలు ఆ ప్లాట్లు తమ పేరుమీద వున్నాయో లేక మరొకరికి అమ్మడయ్యాయో తెలియక కుమిలిపోయారు.

ఆ తర్వాత పున్నారావు సలహాలవల్ల ఎంతో కోల్పోతున్నామని, అతను చెప్పే మాటలు వినకూడదని ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు.


○○○

ఓ రోజు.

"ఏవండీ..మిమ్మల్నే" మీకు పిలిచినట్టు అనిపించిందా! వద్దు, వెనక్కి తిరగద్దు. అతడు పున్నారావే అయ్యుంటాడు. వెనక్కి తిరిగితే బలవటం ఖాయం. ఇలాంటివాళ్ళూ మిడి మిడి జ్ఞానంతో వాళ్ళు లాసవుతారు, మనల్నీ ముంచేస్తారు. వీళ్ళవళ్ళే నెట్‌వర్క్ మార్కెటింగ్ లాంటివి మూడుపువ్వులు ఆరుకాయలుగా విలసిల్లుతాయి. వీళ్ళకి ఎప్పుడూ ఏదో ఒక కొత్తఇష్యూ వుండాలి. ఫాలోవర్స్ వుండేలా కమ్యూనికేషన్ స్కిల్స్ వుంటాయి. అదో మానసికరుగ్మతో ఏమో అర్థం కాదు. వేలల్లో, లక్షల్లో మోసపోయిన బాధితులు పేపర్లకి, టీవీ ఛానల్‌లకి ఎక్కుతారు. అందులో మీరుండకూడదనుకుంటే - తస్మాత్ జాగ్రత్త!

○






శ్రీదేవి రీ ఎంట్రీ 'ఇంగ్లీష్ వింగ్లీష్' మంచి విజయాన్ని సాధించి ఆమెకి కూడా సరికొత్త పాపులారిటీని తెచ్చి పెట్టింది. దీంతో శ్రీదేవి ప్రధాన పాత్రలో సినిమాలు తీయడానికి కొంత మంది నిర్మాతలు ఉత్సాహాన్ని కనబర్చారు. అయితే అవేవీ కాకుండా 'ఇంగ్లీష్ వింగ్లీష్' సినిమాకి సీక్వెల్‌లోనే ప్రస్తుతానికి శ్రీదేవి నటించబోతోందనే వార్తలు వచ్చాయిూమధ్య. కానీ వాటిలో నిజం లేదని చెప్పుకొచ్చింది ఆ చిత్రదర్శకురాలు గౌరీ షిండే. 'ఇంగ్లీష్ వింగ్లీష్'కి సీక్వెల్ తీస్తే బావుంటుంది కానీ ఇప్పటి వరకైతే ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని తేల్చి పారేసిందామె.

